మన అక్షర సాక్షి, ప్రజల మనస్సాక్షి... https://epaper.bbmanews.com/

POLICE BBMA E-NEWS
Telugu Daily
- Andhra pradesh&Telangana

# BBMA
BHARAT BROADCAST AND MEDIA ASSOCIATION

E -NEWS : TELANGANA, ANDHRA, KARNATAKA, DELHI, ODISHA, UP

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 105 ఎడిటర్ మరియు డైరెక్టర్: శ్రీనివాస్ శీలం, పేజీలు - 06 మంగళవారం 23 డిసెంబర్ 2025

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలలో ఇంన్చార్జులు, స్టాఫ్ రిపోర్టర్లు మండల, పట్టణ స్థాయిలో రిపోర్టర్లు కావలెను
ఆసక్తిగల అభ్యర్తులు
https://epaper.bbmanews.com/
నందు రిజిస్టర్ కాగలరు
డైరెక్టర్ & ఎడిటర్. శ్రీనివాస్ శీలం
9052931313

## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

హాకీంపేటలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం


2లో

## గోవా పంచాయితీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం

- ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని మోడీ



**బిబిఎంఏ/పనాజి, డిసెంబర్ 22:** గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సార థ్యంలోని ఎన్డీయే ఘన విజయం సాధిం చడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలన, ప్రగతిశీల రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇదని ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మిగతా2లో...



## ఇస్రో మరో భారీ ప్రయత్నం

- 24 బాహుబలి రాకెట్ ప్రయోగం

**బిబిఎంఏ/నెల్లూరు, డిసెంబర్ 22:** సతీశ్ థావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 24వ తేదీన మరో అతిపెద్ద బాహుబలి రాకెట్ ప్రయోగానికి ముహూర్తం ఖరారు చేశారు. 24న ఉదయం 8:54గంటలకి బాహుబలి రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ఎత్తు - 43.5మీటర్లు, బరువు 6400 మీటర్లు ఉండ గా.. ఈ రాకెట్ ప్రయోగ సమయం 15నిమిషాల 7 సెకన్లు ఉండనుంది. అమెరికాకు చెందిన బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్‌ని నింగిలోకి మోసుకెళ్లనుంది బాహుబలి రాకెట్. శాటిలైట్ బరువు 6100కిలోలు ఉంది. ఈ శాటిలైట్‌ని అమెరికాకి చెందిన స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించింది. గతంలో


మిగతా2లో...

# బెల్టు షాపుల బెల్ట్ తీయండి

● ఆదాయం కాదు..ప్రజల ఆరోగ్యం ముఖ్యం ● అధికారులతో సిఎం చంద్రబాబు



**బిబిఎంఏ/అమరావతి, డిసెంబర్ 22:** లిక్కర్ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, బెల్టు షాపుల ఊసే లేకుండా చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బెల్టు షాపులపై చంద్రబాబు నాయుడు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఆదాయం కాదని.. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని మిగతా2లో...




## నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి సవాల్

ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో పిటిషన్

సోనియా, రాహుల్‌కు నోటీసులు..మార్చి12కు విచారణ వాయిదా

**బిబిఎంఏ/న్యూఢిల్లీ,డిసెంబర్ 22:** నేషనల్ హెరాల్డ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈడీ ఛార్జిషీటుపై ట్రయిల్ కోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను దర్యాప్తు సంస్థ హైకోర్టులో సోమవారంనాడు సవాలు చేసింది. దీంతో కేసులో నిందితులైన కాంగ్రెస్ నేతలు సోని యాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులకు మిగతా2లో...

## రాజధాని గ్రామాల్లో మౌళిక సదుపాయాలు

జనవరి నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం

పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి


2లో

# యువతకు వేదికగా జనసేన

'పదవి- బాధ్యత' సమావేశంలో పవన్

**బిబిఎంఏ/గుంటూరు, డిసెంబర్ 22:** యువతకు సరైన వేదికగా మారాలనే పార్టీ పెట్టినట్లు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. యువతను రాజకీయంగా భాగస్వామ్యం చేయాలని, వారు రాజకీయంగా ఎదుగుదలకు దోహదపడాలన్న సంకల్పంతో ఉన్నామని అన్నారు. కొత్త పంథాను నమ్ముకొని అనేకమంది యువత నక్సల్స్‌లో చేరారని, సిద్ధాంతాలను వదల్లేక వేలాది మంది చనిపోయారని అన్నారు. ఐడియాలజీ సరైంది కాకపోతే అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన 'పదవి- బాధ్యత' సమావేశంలో పవన్ మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ కోసం బలంగా నిలబడ్డారని అందుకే మీ అందరికీ పదవులు వచ్చాయన్నారు. అందరూ కలిస్తేనే సమాజం తయారైందని తెలుసుకోవాలన్నారు. కూర్చోబెట్టి ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం వృథా. ప్రతి వంద కిలోమీటర్లకు మన భాష, అలవాట్లు, ఆచారాలు మారిపోతున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అనేక చర్యలు చేపడుతున్నాం. దురాశతో పర్యావరణానికి తీవ్రంగా నష్టం




చేస్తున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి జరగాలని కోరుతున్నాం. మనం ఏం పని చేసినా రాజ్యాంగానికి లోబడే పని చేయాలని పవన్ పేర్కొన్నారు. జనసేన నిస్వార్థ రాజకీయాలతో కూటమిలో భాగమై, ప్రజలకు సేవ చేస్తోందన్నారు.



## పవన్, ఎన్టీఆర్‌ల పిటిషన్లపై విచారణ

- ఫోటోల మార్ఫింగ్‌పై ఢిల్లీ కోర్టు ఆదేశం

**బిబిఎంఏ/న్యూఢిల్లీ, డిసెంబర్ 22:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ దాఖలు చేసిన వ్యక్తిత్వ హక్కుల పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టుసోమవారం విచారణ చేపట్టింది. జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరా ధర్మాసనం ఈ వ్యవహారాన్ని పరిశీలించింది. సామాజిక మాధ్యమాల్లో తమ ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా వాణిజ్య అవసరాలకు మిగతా2లో...

## ఉగాదికి నంది నాటకోత్సవాలను నిర్వహించే ఆలోచన

ఏపిలో నిర్మించే చిత్రాలకు రాయితీలు ఇస్తాం

జనవరి 8 నుంచి 10 వరకు ఆవకాయ్ ఉత్సవాలు

పోస్టర్ ఆవిష్కరణచేసిన మంత్రి కందుల దుర్గేశ్


2లో

## వీసా ప్రక్రియ విశ్వసనీయత పెంచే యత్నం

● సోషల్ మీడియా వెట్టింగ్‌పై యూఎస్ వివరణ ● వీసా దుర్వినయోగం అరికట్టడానికే అని వెల్లడి


2లో

## స్పీకర్ అయ్యాక మాట్లాడడం తగ్గింది

బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్నా

ఏపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి


2లో

# రాజధాని గ్రామాల్లో మౌళిక సదుపాయాలు

**బిబిఎంఏ/గుంటూరు, డిసెంబర్ 22:** జనవరి నుంచి రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ చెప్పారు. మండలంలోని వడ్డమానులో రూ 98.7 లక్షలతో నిర్మించిన రోడ్డును మంత్రి సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ? అమరావతి రాజధాని ప్రపంచంలో టాప్ 5 లో ఉండేలా నిర్మిస్తున్నామన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. రాజధానిలోని 29 గ్రామాల్లో జనవరి నుంచి మౌలిక వసతుల పనులు చేపడతామని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ, రైల్వే లైన్, రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటామని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ల్యాండ్ పూలింగ్ కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, ల్యాండ్ పూలింగ్ కు ఎవరైనా ముందుకు రాకుంటే అప్పుడు భూసేకరణ పై నిర్ణయం తీసుకుంటామన్నారు.

# ఉగాదికి నంది నాటకోత్సవాలను నిర్వహించే ఆలోచన

**బిబిఎంఏ/అమరావతి, డిసెంబర్ 22:** వచ్చే ఉగాది నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నంది అవార్డులతో పాటు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వీటిని తిరిగి అత్యంత వేడుకగా నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. ఈ వేడుకలు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నారని తెలిపారు. అమరావతిలో 'ఆవకాయ్' ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా దుర్గేశ్ ప్రకటించారు. జనవరి 8 నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు సినిమా సాహిత్యం, కవిత్వం, సంగీతం, నృత్య విభాగాల్లో ఈ వేడుకలు ఉండనున్నాయి. కృష్ణానదీ తీరం పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో వీటికోసం ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి కందుల ఆవిష్కరించారు. అనంతరం సినీ పరిశ్రమ గురించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఏపీలో షూటింగ్ జరుపుకొనే చిత్రాలకు ప్రభుత్వం నుంచి మరింత సహకారం ఉంటుంది. నంది అవార్డులు.. నంది నాటకోత్సవాలు జరగాలి. నాటకాన్ని సినిమానూ సమానంగా చూడాలని సీఎం పలుమార్లు చెబుతున్నారు. చిత్ర పరిశ్రమలోని సమస్యల పరిష్కారానికి త్వరలో సినిమాటోగ్రఫీశాఖ ఓ సమావేశం నిర్వహించనుంది. కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ఏ రకమైన ఆలోచన చేయాలి? వాళ్ల ఇబ్బందులను తొలగించాలన్న దానిపై ఇందులో మాట్లాడతాం. ఈ సమావేశంలో సినీ పరిశ్రమ వర్గాలేవీ పాల్గొనడం లేదు. వారితో మరోసారి సమావేశం నిర్వహించి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వారికి వివరిస్తామని మంత్రి దుర్గేశ్ వివరించారు. బడ్జెట్‌ను బట్టి సినిమాకు సహకారం అందించాలని ఒక ఆలోచన ఉంది. అలాగే ఏపీలో షూటింగ్ చేసిన సినిమాలకు ఇంకొంత సపోర్ట్ చేయాలి. థియేటర్ల నుంచి ఆదాయం తగ్గుతోంది కాబట్టి, ప్రస్తుతం ఉన్న విధి విధానాల ప్రకారం అత్యధిక బ్జడెట్ సినిమాలకు సహకారం అందిస్తున్నాం. ఇక్కడ రెండు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. నటీనటుల పారితోషికం కాకుండా సినిమా బ్జడెట్ ఎక్కువగా ఉంటే ఆ సినిమాకు సహకారం ఇవ్వాలని ఒక వాదన నడుస్తోంది. నటీనటులు, సాంకేతిక నిపుణులకు పారితోషికంతో కలిపితే సినిమా బ్జడెట్ అవుతుందన్న మరో వాదన కూడా ఉంది. ఈ రెండింటికీ మధ్యే మార్గంగా ఎలా చేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నాం. దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం. ఏపీలో ఎక్కువగా షూటింగ్ సినిమాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం అని మంత్రి వివరించారు.

# వీసా ప్రక్రియ విశ్వసనీయత పెంచే యత్నం

**బిబిఎంఏ/న్యూఢిల్లీ, డిసెంబర్ 22:** అమెరికా దౌత్య కార్యాలయం హెచ్-1, హెచ్-4 వీసా దరఖాస్తుదారుల కోసం గ్లోబల్ అలర్ట్ జారీ చేసింది. డిసెంబర్ 15 నుంచి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్' వీసా స్క్రీనింగ్‌లో భాగంగా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ప్రెజెన్స్ అంటే సోషల్ మీడియా, డిజిటల్ యాక్టివిటీ సమీక్ష పరిధిని విస్తరించినట్లు వెల్లడించింది. ఈ కొత్త విధానం అన్ని దేశాలకు చెందిన దరఖాస్తుదారులకు వర్తించనుంది. ఈ చర్య వీసా కార్యక్రమం దుర్వినియోగాన్ని అరికట్టడం కోసమేనని అమెరికా దౌత్య కార్యాలయం స్పష్టం చేసింది. ఫేక్ జాబ్ ఆఫర్లు, తప్పుడు సమాచారం, మధ్యవర్తుల పాత్ర వంటి అక్రమాలను నియంత్రించడం ద్వారా అమెరికా సంస్థలు నిజమైన, అర్హత కలిగిన తాత్కాలిక విదేశీ ఉద్యోగులను నియమించుకునేలా చేయడమే లక్ష్యమని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా ఎంబసీలు, కాన్సులేట్లు వీసా దరఖాస్తులను యథావిధిగా స్వీకరిస్తూ ప్రాసెస్ చేస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ సమీక్ష విస్తరణ కారణంగా అదనపు ప్రాసెసింగ్ సమయం పట్టే అవకాశం ఉందని దరఖాస్తుదారులకు ముందుగానే సూచించారు. వీసా వ్యవస్థలో మోసాలు, నకిలీ ఉద్యోగ ఆఫర్లు, తప్పుదారి పట్టించే సమాచారం వంటి అంశాలపై అమెరికా గత కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియా, ఆన్‌లైన్ కార్యకలాపాల సమీక్షను స్టాండర్డ్ వీసా స్క్రీనింగ్‌లో భాగంగా చేర్చింది. ఇది ఏ ఒక్క దేశం లేదా సమూహాన్ని లక్ష్యంగా చేసుకున్న చర్య కాదని అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం అనంతరం అమెరికాలో ఉద్యోగం కోరుకునే పలువురు దరఖాస్తుదారులు గోప్యతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో తమ ప్రొఫైల్స్ పబ్లిక్‌గా ఉంచడం వల్ల వ్యక్తిగత సమాచారం డేటా బ్రోకర్ల చేతుల్లోకి వెళ్లి కాపీ లేదా అమ్మకం జరిగే ప్రమాదం ఉందని కొందరు అభిప్రాయపడ్డారు. కొంతమంది దరఖాస్తుదారులు ప్రభుత్వమే అధికారిక అకౌంట్ల నుంచి రిక్వెస్ట్ పంపడం, లేదా వీసా ఇంటర్వ్యూ సమయంలో మొబైల్ ద్వారా ప్రొ÷ల్ చూపించే అవకాశం ఇవ్వాలని సూచించారు. అయితే ఈ అభ్యంతరాలపై ఇప్పటివరకు అమెరికా అధికారులు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయలేదు. అమెరికా అధికారుల ప్రకారం ఆన్‌లైన్ ప్రెజెన్స్ సమీక్ష ప్రపంచవ్యాప్తంగా అన్ని వీసా దరఖాస్తుదారులకు సమానంగా వర్తిస్తుంది. వీసా పక్రియ యొక్క విశ్వసనీయతను కాపాడటమే దీని ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు.

# స్పీకర్ అయ్యాక మాట్లాడడం తగ్గింది

**బిబిఎంఏ/విజయవాడ, డిసెంబర్ 22:** ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తన రాజకీయ జీవితం, స్పీకర్ బాధ్యతలు, సైబర్ నేరాలు, యువత పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృష్ణాజిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడు తూ.. స్పీకర్ కావడానికి ముందు తాను ఎక్కువగా మాట్లాడే వాడినని, స్పీకర్ అయిన తర్వాత మాత్రం నోటికి ఎలాస్టర్ వేసినట్టయ్యిందని వ్యాఖ్యానించారు. సభలో కూర్చుని ఆదేశాలు ఇవ్వడం తప్ప గత రెండేళ్లుగా మాట్లాడే అవకాశం లేదని అన్నారు. స్పీకర్ పదవి చాలా బాధ్యతాయుతమైనదని, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇక, టెక్నాలజీ పెరుగుతున్నందుకు సంతోషమే కానీ, అదే స్థాయిలో నేరాలు కూడా పెరుగుతున్నాయని అయ్యన్న పాత్రుడు ఆందోళన వ్యక్తం చేశారు. మనకు తెలియకుండానే బ్యాంక్ ఖాతాల్లోని డబ్బు మాయం అవుతోందని, సైబర్ నేరాలు తీవ్ర స్థాయికి చేరాయని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గా ఉందని వెల్లడించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనతో కలిసి ఈ కాలేజీకి వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్న అయ్యన్న పాత్రుడు.. సైబర్ క్రైమ్‌ను అరికట్టేందుకు ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కాలేజీ యాజమాన్యం చేసిన మంచి పని అని ప్రశంసించారు. రెండు తెలుగు రాష్టాల్లో్ ఇలాంటి టెక్నాలజీ అరుదని, సైబర్ క్రైమ్‌పై మొదటిసారి ఈ స్థాయిలో టెక్నాలజీని ఇక్కడ తీసుకువచ్చారని అన్నారు. ఈ విభాగం కోసం కేవీ రావు రూ.1 కోటి 37 లక్షలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ వినియోగం భారీగా పెరిగిందని, అందుకు అనుగుణంగా పోలీస్ శాఖకు టెక్నాలజీపై పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. టెక్నాలజీ తెలియక పోతే సైబర్ నేరాలను అదుపు చేయడం కష్టమని, పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే, సైబర్ క్రైమ్‌పై ప్రభుత్వం భారీ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సైబర్ టెక్నాలజీ చదువుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. తాను మొదట రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదని అయ్యన్న పాత్రుడు తెలిపారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన తర్వాత ఆయన కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని, ఎన్టీఆర్‌ను కలిసిన తరువాత ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నామని చెప్పారని వివరించారు. వయసు సరిపోలేదని మొదట తటపటాయించినా, ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. ఎన్టీఆర్ దయవల్ల 8 సార్లు ఎమ్మెల్యేగా, 6 సార్లు మంత్రిగా పనిచేశానని, ఇప్పుడు స్పీకర్‌గా ఉన్నానని అన్నారు. ప్రస్తుతం రాజకీయాలు కొంత మేర భ్రష్టుపట్టాయని వ్యాఖ్యానించిన అయ్యన్న పాత్రుడు, యువకులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. యువత తీసుకునే నిర్ణయాలు న్యాయంగా, వేగంగా ఉంటాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీని ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలు ఎమ్మెల్యేలు, మంత్రులుగా పాత్రలు పోషించారని, వారు తమకంటే కూడా చాలా బాగా వ్యవహరించారని అన్నారు. చిన్న వయసులోనే ఇంత ప్రతిభ కనబరుస్తున్న పిల్లలను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

# పల్నాడు జిల్లాలో మరో దారుణం

● అన్నదమ్ములను నరికి చంపిన దుండగులు



**బిబిఎంఏ/పల్నాడు,డిసెంబర్ 22:** పల్నాడు జిల్లాలో మరో దారుణం చోటుచేసుకుంది. అన్నదమ్ములను గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. దుర్గి మండలం అడిగొప్పలలో ఈ ఘటన జరిగింది. తమ్ముడు కొత్తా హనుమంతు, అన్న కొత్తా శ్రీరాంమూర్తిని ఆదివారం అర్ధరాత్రి వేటకొడవళ్లతో హతమార్చారు. హనుమంతును గ్రామం మధ్యలో.. శ్రీరాంమూర్తిని అమ్మవారి గుడి సమీపంలో అత్యంత కిరాతకంగా చంపేశారు. మృతులిద్దరినీ తెదేపా సానుభూతిపరులుగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ జంట హత్యలపై పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆయన మాట్లాడారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టవద్దని ఆదేశించారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి హంతకుల కోసం వేట ప్రారంభించారు.

# బిర్యానీ తిన్న మత్స్యకారులకు ఫుడ్ పాయిజనింగ్

**బిబిఎంఏ/కాకినాడ, డిసెంబర్ 22:** కాకినాడ జిల్లా ఉప్పాడ ప్రాంతంలో విషతుల్య ఆహారం కలకలం రేపింది. తీర ప్రాంతానికి చెందిన కొందరు మృత్సకారులు అస్వస్థతకు గురవ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఉప్పాడ తీర ప్రాంతానికి చెందిన 8 మంది మత్స్యకారుల సమూహం ఇటీవల చేపల లోడింగ్ కోసం బైరవపాలెం వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆకలేసి తాళ్లరేవు సమీపంలో గల ఓ హోటల్లో బిర్యానీ ఆరగించారు. ఫుడ్ పాయిజన్ కావడంతో.. అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో వారిని యు.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు స్థానికులు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అయితే.. అక్కడి వైద్యులు వీరిని పరీక్షించిన తర్వాత ప్రమాదమేమీ లేదని నిర్ధారించారు. దీంతో బాధితులు సహా వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం.. వారు పిఠాపురంలో చికిత్స పొందుతున్నారు.

# ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

**బిబిఎంఏ/హైదరాబాద్, డిసెంబర్ 22:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ శీతాకాల పర్యటన ముగిసింది.. హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడ్కోలు పలికారు. రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,మంత్రి సీతక్క , ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఉన్నారు. దాదాపు ఆరు రోజులపాటు ముర్ము హైదరాబాద్‌లో బస చేశారు. ఈ నెల 17న హైదరాబాద్ చేరుకున్న ఆమె.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి..ప్రత్యేక విమానంలో దిల్లీ పయనమయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర కిషన్‌రెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

# గోవా పంచాయితీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం

(మొదటి పేజీ తరువాయి)

ట్వీట్ చేశారు. 'సుపరిపాలనకు గోవా ప్రజలు అండగా నిలిచారు. ప్రగతిశీలక రాజకీయాలకు పట్టం కట్టారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ-ఎంజీపీ (ఎన్డీయే) కుటుంబానికి బలమైన మద్దతు ఇచ్చిన నా సోదరులకు, సోదరీమణులకు కృతజ్ఞతలు' అని అన్నారు. గోవా అభివృద్ధి దిశగా ఎన్డీయే చేస్తున్న ప్రయత్నాలకు ప్రజాతీర్పు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం పునరకింతమవుతుందని పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయానికి కారణమైన కార్యకర్తలను ప్రధాని అభినందించారు. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో బీజేపీపై నమ్మకం ఉంచి ఘన విజయం అందించిన ఓటర్లకు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ-ఎంజీపీ కూటమి నుంచి గెలుపొందిన అభ్యర్థులను అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వంపై ప్రజలు నిర్ణయాత్మక తీర్పునిచ్చారని అన్నారు. 'గోవాలో బీజేపీ నెంబర్ 1. ఇంతటి ఘనవిజయంతో బీజేపీని ఆశీర్వదించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సీఎం పేర్కొన్నారు. గోవా జిల్లా పంచాయతీ ఎన్నికల ఫలితాలు సోమవారంనాడు వెలువడ్డాయి. మొత్తం 50 సీట్లలో 30 సీట్లు బీజేపీ గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు, స్వతంత్ర అభ్యర్థులు 5 సీట్లు గెలుచుకున్నారు. మహారాష్ట్ర గోమంతక్ పార్టీ (ఎండీపీ) రెండు స్థానాల్లో గెలుపొందగా, గోవా ఫార్వార్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), రివల్యూషనరీ గోన్స్ పార్టీ (ఆర్‌జీపీ) ఒక్కో సీటు చెప్పున గెలుచుకున్నాయి. బీజేపీ ఈ ఎన్నికల్లో ఎంజీపీతో కలిసి పోటీ చేయగా, జీఎఫ్‌పీ పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసింది. 2027లో గోవా అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, 2012 నుంచి రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంది.

# ఇస్రో మరో భారీ ప్రయత్నం

(మొదటి పేజీ తరువాయి)

పంపిన శాటిలైట్ల కంటే పదిరెట్లు అధిక సామర్థ్యంతో బ్లూ బార్డ్ బ్లాక్ - 2 శాటిలైట్ పనిచేయనుంది. ఎల్‌విఎం రాకెట్ సిరీస్‌లో ప్రస్తుతం ఎనిమిదో ప్రయోగం జరగనుంది. ఇప్పటి వరకు జరిగిన ఏడు ప్రయోగాలు విజయవంతమైన విషయం తెలిసిందే. చంద్రయాన్ -3 ప్రయోగానికి ఎల్‌విఎం-3 రాకెట్‌ని ఇస్రో వినియోగించనుంది. ఈ నేపథ్యంలో షార్‌కి ఇస్రో ఛైరన్ డాక్టర్ నారాయణన్, అమెరికా ప్రతినిధులు చేరుకున్నారు. ఎల్‌విఎం-2 ఎం6ప్రయోగం పూర్తి వాణిజ్య ప్రయోగంగా తెలుస్తోంది. భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకి అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో షార్‌లో జవాన్లు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు.

# బెల్టు షాపుల బెల్ట్ తీయండి

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పున:పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని స్పష్టం చేశారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు.. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె. శంకరరావు కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసి గవర్నర్ ఆమోదానికి పంపించారని ప్రస్తావించారు. ఏపీలో కూడా బీసీలకు స్థానిక సంస్థల్లో వారి జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తి పట్ల సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని శంకరరావు పేర్కొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి సవాల్

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు పూర్తి చేసిందని, సాక్ష్యాలను సేకరించిందని, కేసులో భాగంగా పలుచోట్ల సోదాలు కూడా జరిపిందని చెప్పారు. ఈడీ ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోకుండా దిగువ కోర్టు తప్పు చేసిందని ఆయన వాదించారు. ఈ కేసుపై తదుపరి విచారణను వచ్చే మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు గత మంగళవారంనాడు నిరాకరించింది. చార్జిషీటును తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేటు వక్తి సుబ్రమణ్యం స్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా చార్జిషీటును పరిగణనలోకి తీసుకోలేమని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టం ప్రకారం దీన్ని విచారించడం సాధ్యం కాదన్నారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ప్రత్యేక న్యాయమూర్తి గుర్తుచేశారు. అలాంటప్పుడు ఈడీ చార్జిషీటు ఆధారంగా తీర్పు ఇవ్వడం తొందరపాటే అవుతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ కేసులో ఈడీ దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు ఆదేశాలిచ్చింది. ఈడీ ఛార్జిషీట్లులో సోనియగాంధీ, రాహుల్ గాంధీ పేర్లతో పాటు సుమన్ దూబే, శామ్ పిత్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్, సునీల్ భండారి పేర్లు చేర్చింది.

# పవన్, ఎన్టీఆర్‌ల పిటిషన్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించడం, తప్పుడు ప్రచారం చేయడం వల్ల తమ వ్యక్తిత్వ హక్కులకు భంగం వాటిల్లుతోందని ఎన్టీఆర్, పవన్ కల్యాణ్ పిటిషన్లలో పేర్కొన్నారు. వీరిద్దరి తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ వాదనలు వినిపించారు. మార్ఫింగ్ ఫొటోలు, అవమానకర పోస్టులు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కేసుల్లో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే కొన్ని లింకులను తొలగించినట్లు ప్రతివాదులు కోర్టుకు వివరించారు. అయితే తొలగించిన లింకులపై ఆదేశాలు జారీ చేయడానికి ముందు సంబంధిత ఖాతాదారులకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. లింకులు అభిమానుల ఖాతాల నుంచి వచ్చినవని ఇన్‌స్టాగ్రామ్ నిరాకరణతో స్పష్టంగా పేర్కొనాలని హైకోర్టు సూచించింది. గూగుల్ తమ వినియోగదారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని లేదా ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది. సంబంధిత లాగిన్ వివరాలను మూడు వారాల్లో అందించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను మే 12వ తేదీకి వాయిదా వేసింది.

# ఆగి ఉన్న ట్రాలీని ఢీకొట్టిన లారీ ముగ్గురు మృతి

## ఘటనా స్థలాన్ని పరిశీలించిన మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్





**బిబిఎంఏ పోలీస్ ఈ న్యూస్, మంచిర్యాల జిల్లా , డిసెంబర్ 22:** మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం క్రాస్ రోడ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని డీసీపీ ఏ. భాస్కర్ స్వయంగా సందర్శించి విచారణ చేపట్టారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుండి 22 మంది వరి నాట్లు వేసే కూలీలతో సుల్తానాబాద్ వెళ్తున్న ట్రాలీ వాహనాన్ని, రోడ్డు పక్కన ఆపి ఉన్న సమయంలో వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ విషాద ఘటనలో ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వెంటనే చంద్రపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రమాద స్థలిని క్షుణ్ణంగా పరిశీలించిన డీసీపీ, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను విశ్లేషించి సమగ్ర నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రాణ నష్టం కలిగించే ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారి భద్రత చర్యలను తక్షణమే కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జైపూర్ ఏసీపీ ఆర్. వెంకటేశ్వర్లు, సీఐ నవీన్, ఎస్ఐ శ్రీధర్  ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కమిషనరేట్‌లో ఘనంగా కాకా వెంకటస్వామి వర్ధంతి వేడుకలు



**బిబిఎంఏ న్యూస్/ రామగుండం:** కాకా వెంకటస్వామి వర్ధంతి వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్‌తో పాటు పోలీస్ అధికారులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సేవ, క్రమశిక్షణ, నైతికతకు జి. వెంకటస్వామి జీవితం నిదర్శనమని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా సేవలందించిన ఆయన దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, సూపరింటెండెంట్లు ఇంద్రసేన, సందీప్, సంధ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాకుళం పోలీస్ శిక్షణ కేంద్రంలో ఎస్‌సీటీపీసీ కానిస్టేబుల్ శిక్షణ ఘనంగా ప్రారంభం





**బిబిఎంఏ న్యూస్/శ్రీకాకుళం, డిసెంబర్ 22:** పోలీస్ కానిస్టేబుల్ శిక్షణలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం తండేవలసలో సోమవారం స్టైపెండియరీ క్యాడెట్ ట్రెయినీ పోలీస్ కానిస్టేబుల్స్ (ఎస్‌సీటీపీసీ) శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. రాజమండ్రి, కృష్ణా జిల్లాలకు చెందిన 145 మంది నూతన ట్రెయినీలకు తొమ్మిది నెలల శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి శాంతికి ప్రతీకగా పావురాలను నింగిలోకి విడిచిపెట్టారు. ఎస్పీ మాట్లాడుతూ...పోలీస్ ఉద్యోగం కేవలం ఉపాధి కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన సేవా వృత్తి అని అన్నారు. శిక్షణ కాలాన్ని నిబద్ధతతో సద్వినియోగం చేసుకొని చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత ప్రతి పోలీసుపై ఉందని తెలిపారు. అదనపు ఎస్పీ (ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్) కె.వి.రమణ మాట్లాడుతూ... శారీరక, మానసిక స్థైర్యం, సైబర్ నేరాలపై అవగాహన, ప్రజలతో మైత్రీ సంబంధాలు అవసరమన్నారు. క్రిమినల్ లా, ప్రత్యేక చట్టాలు, ఆయుధాల వినియోగం, డ్రిల్, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల నిర్వహణపై సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) శ్రీ పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు ఇక స్వస్తి ..గీతం యూనివర్సిటీలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అవగాహన కార్యక్రమం



**బిబిఎంఏ న్యూస్/సంగారెడ్డి:** తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSP) సహకారంతో సంగారెడ్డి జిల్లా రుద్రారం గీతం విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ఆరు వారాల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా జరిగిన ఈ సమావేశానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్ ఐపిఎస్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. సైబర్ నేరగాళ్లు ఉపయోగించే మోసపూరిత పద్ధతులు, హానికరమైన సాఫ్ట్‌వేర్ ద్వారా డేటా దుర్వినియోగం, బ్లాక్‌మేయిల్, ఆర్థిక నష్టాల గురించి వివరించారు. ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ (తెలంగాణలో నిషేధితం), ఆన్‌లైన్ చాటింగ్‌లో పాల్గొనేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ...ఓటీపీ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, హానికరమైన ఏపీకే ఫైల్స్, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్ల ద్వారా జరుగుతున్న మోసాలపై విద్యార్థులను అప్రమత్తం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ నోడల్ అధికారి డీఎస్పీ కే.వీ. సూర్యప్రకాశ్, బీటెక్ తొలి ఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ పి.త్రినాథరావు, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, పటాన్ చెరువు ఇన్‌స్పెక్టర్ వినాయక్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవి, ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకా వెంకటస్వామికి భారతరత్న ప్రకటించాలి: లయన్స్ క్లబ్ నేతల డిమాండ్



**బిబిఎంఏ న్యూస్/గోదావరిఖని:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితమైన జీవితం గడిపిన మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి అభినవ అంబేడ్కర్ అని, ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పి. మల్లికార్జున్, కాంగ్రెస్ సీనియర్ లీడర్ గుమ్మడి కుమారస్వామి డిమాండ్ చేశారు. కాకా వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అల్పాహారం, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కాకా వెంకటస్వామి చేసిన పోరాటాన్ని వారు గుర్తు చేశారు.

## పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామపంచాయతీ సర్పంచ్ కొలిపాక చంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం



**అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ గ్రామపంచాయతీ సర్పంచ్ కొలిపాక చంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేసారు. వారితో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులతో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ .. గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ పథకాలను , గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రాచకొండ పోలీస్ వార్షిక ప్రెస్ మీట్ - 2025

**బిబిఎంఏ న్యూస్/**రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక ప్రెస్ మీట్-2025 ఆదివారం ఘనంగా నిర్వహించారు. "రాచకొండ 2025: దృఢమైన పోలీసింగ్  ప్రజలతో భాగస్వామ్యం" అనే అంశంతో జరిగిన ఈ సమావేశంలో కమిషనరేట్ సాధించిన ప్రధాన విజయాలను రాచకొండ సిపి సుధీర్ బాబు, ఐపీఎస్ వివరించారు. ఈ సందర్భంగా వార్షిక నివేదిక (అనివల్ రిపోర్ట్)ను ఆవిష్కరించారు. గత ఏడాది కాలంలో కనిపించే పోలీసింగ్, వేగవంతమైన స్పందన, సాంకేతికత ఆధారిత చర్యల ద్వారా ప్రజా భద్రతను బలోపేతం చేసినట్లు కమిషనర్ తెలిపారు. నేరాల నివారణ, చట్ట అమలు, బాధితులకు న్యాయం అందించడం, పునరావాసం, ప్రజలతో భాగస్వామ్యంగా పనిచేయడం వంటి అంశాల్లో రాచకొండ పోలీసులు కొత్త ప్రమాణాలు నెలకొల్పారని పేర్కొన్నారు.కేసుల సంఖ్యకే పరిమితం కాకుండా, రక్షించబడిన ప్రాణాలు, సంపాదించిన ప్రజల విశ్వాసం, తిరిగి తీసుకొచ్చిన భద్రతా భావమే తమ విజయ సూచికలని సుధీర్ బాబు ఐపీఎస్ తెలిపారు. ప్రజల మద్దతుతో "పోలీస్ విత్ పీపుల్" దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# నూతన పాలకవర్గ గ్రామపంచాయతీ కమిటీ ప్రమాణ స్వీకారం



**బిబిఎంఎ న్యూస్/మంథని, డిసెంబర్ 21:** గ్రామ పంచాయతీ కొత్తగా ఎన్నికైన సర్పంచ్ ఆర్ల నాగరాజు, ఉప సర్పంచ్ పులి సుచరిత, గ్రామ వార్డు సభ్యులతో సోమవారం సూరయ్య పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి, కారోబార్ సిబ్బంది గ్రామ ప్రజానీకంలో ప్రమాణ స్వీకారం చేసారు. అనంతరం ఇప్పటి వరకు గ్రామ పంచాయతీకి ప్రత్యేకాధికారులుగ, వ్యవహరిస్తున్న కార్యకలాపాలను అధికారులు సర్పంచుకి బాధ్యతలు అప్పగించారు. ప్రమాణమే ప్రామాణికంకొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ప్రమాణ స్వీకారాన్నే ప్రామాణికంగా పూర్తి చేసారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచే సాంకేతికంగా పాలకవర్గాం పూర్తి బాధ్యతలు ఉంటాయని. అని తెలియచేశారు.


# రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసుల అవగాహన కార్యక్రమం



**బిబిఎంఏ న్యూస్ /అమలాపురం:** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి రాహుల్ మీనా ఆదేశాల మేరకు మండపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దొరరాజు తన సిబ్బందితో కలిసి 1/3 ఇప్పనపాడు సెంటర్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, మితిమీరిన వేగంతో డ్రైవ్ చేయడం ప్రమాదాలకు దారి తీస్తుందని స్పష్టంగా తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు తెలియజేశారు.

# అంగరంగ వైభవంగా బుగ్గారం పాలక వర్గం ప్రమాణ స్వీకారం..





**బిబిఎంఏ న్యూస్/బుగ్గరం:** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామ పంచాయతీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగింది. పంచాయతీ కార్యదర్శి ఎం.ఎ.అక్బర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి జి.సునీత ప్రత్యేక అధికారిణిగా, ఎంపిడివో సుమంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీపారాధన అనంతరం తెలంగాణ, జాతీయ గీతాలను ఆలపించారు. ఇందిరమ్మ చీరలు ధరించిన మహిళా ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సర్పంచ్ నక్క రాజవ్వ, ఉప సర్పంచ్ జంగ లావణ్యతో పాటు 13 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని పాలక వర్గం హామీ ఇచ్చింది.

## కరీంనగర్‌లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం




**బిబిఎంఏ న్యూస్/కరీంనగర్:** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్తు పదార్థాల మూలాలను గుర్తించి పూర్తిగా పెకిలించివేయాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంచే కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.డ్రగ్స్ రహిత కరీంనగర్ కోసం అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## పోలీస్ కుటుంబానికి ఆర్థిక చేయూత



**బిబిఎంఏన్యూస్**/నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయం ఆధ్వర్యంలో విధుల్లో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ అధికారికి చెందిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్, "చేయూత" పథకం కింద రూ.2 లక్షల చెక్కును కొండమల్లెపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఎస్ఐ సీత్యా నాయక్ భార్య దస్లీ బాయికి అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎప్పుడూ తమ సిబ్బంది కుటుంబాల వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

### తెలంగాణ ఉద్యమ యోధుడు గడ్డం వెంకట స్వామి(కాక)కి జిల్లా పోలీసుల ఘన నివాళులు




**బిబిఎంఏ పోలీస్ ఈ న్యూస్,నిర్మల్ జిల్లా, డిసెంబర్ 22:** కేంద్ర మాజీ మంత్రి తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత గడ్డం వెంకట స్వామి (కాక) గారి 11వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో కాక చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాక చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా స్మరించుకుంటూ, ఆయన త్యాగాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వర్ధంతి నివాళిలో జిల్లా పోలీసు అధికారులు, డి.పి.ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 4411 కేసుల పరిష్కారం: సిపి అంబర్ కిషోర్ ఝా



**బిబిఎంఏ న్యూస్ /రామగుండం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 4411 కేసులు విజయవంతంగా పరిష్కరించబడ్డాయి. వీటిలో IPC కాంపౌండబుల్ కేసులు 386, SLL కేసులు 16, ఈ–పెట్టీ కేసులు 2971, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1038 ఉన్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.సైబర్ నేరాలకు సంబంధించిన 59 కేసుల్లో బాధితులకు మొత్తం రూ.53,24,105/– తిరిగి అందజేయడం జరిగిందన్నారు. గత 15 రోజులుగా పోలీసులు, కోర్టు సిబ్బంది కక్షిదారులను స్వయంగా కలసి రాజీ మార్గంలో న్యాయం పొందేలా కృషి చేయడం వల్ల లక్ష్యానికి మించి కేసులు పరిష్కారమయ్యాయని సీపీ తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్, కోర్టు సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించగా, లోక్ అదాలత్ విజయానికి సహకరించిన జోన్ ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా భీమవరంలో విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం



**బిబిఎంఎ న్యూస్/భీమవరం** :భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బీహారి వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.భీమవరానికి చేరుకున్న కేంద్ర మంత్రికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మతో కలిసి అటల్ బీహారి వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, అటల్ బీహారి వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాజకీయాల్లో విలువలు, నైతికతలకు ప్రతీకగా వాజ్‌పేయి నిలిచారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

## చోరీ కేసుల పరిష్కారంలో పోలీసుల ప్రతిభ - జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందన



**బిబిఎంఎ న్యూస్/అమలాపురం** :జిల్లాలో జరిగిన పలు చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను సమర్థవంతంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసుల వివరాలను వెల్లడించిన ఎస్పీ, కేసుల పరిష్కారంలో పోలీసు సిబ్బంది చూపిన చాకచక్యం, అంకితభావం ప్రశంసనీయమని తెలిపారు.ఈ సందర్భంగా అమలాపురం డీఎస్పీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, క్రైం సీఐ గజేంద్రకుమార్లతో పాటు ఎస్సైలు పరదేశి, సురేంద్ర, రాము, ఏఎస్సై బాలకృష్ణ, రావులపాలెం రూరల్ ఎస్సై విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై రాము తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు సమన్వయంతో పనిచేసి, తక్కువ సమయంలోనే కేసులను ఛేదించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతే లక్ష్యంగా ఇదే స్థాయి నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించి, అనుమానాస్పద ఘటనలను వెంటనే తెలియజేయాలని కోరారు.

## టెలిగ్రామ్‌లో ఉద్యోగం పేరుతో సైబర్ మోసం - మహిళ నుంచి రూ. 8.5 లక్షల దోపిడి

**బిబిఎంఎ న్యూస్/ఉప్పలగుప్తం :**ఉద్యోగం ఇప్పిస్తామని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు ఓ మహిళ నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ఘటన ఉప్పలగుప్తం మండలంలో వెలుగులోకి వచ్చింది. ఉప్పలగుప్తం పంచాయతీ పరిధిలోని పేరాయిచెరువుకు చెందిన మహిళకు సుమారు 20 రోజుల క్రితం టెలిగ్రామ్ యాప్ ద్వారా ఉద్యోగ అవకాశమంటూ ఒక లింక్ వచ్చింది.ఆ లింక్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు, చిన్న పనులు చేస్తే లాభాలు వస్తాయని నమ్మించారు. మొదట కొంత మొత్తానికి లాభాలు వచ్చినట్లు చూపించి, ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలంటే మరింత డబ్బు చెల్లించాలని కోరారు. దీంతో బాధితురాలు నమ్మి విడతల వారీగా మొత్తం రూ. 8.5 లక్షలు పంపించింది.చివరికి మరోసారి రూ. 11,500 పంపిన అనంతరం నిందితులు ఆమెతో ఉన్న అన్ని సంప్రదింపులను నిలిపివేయడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజేష్ ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, సోషల్ మీడియా, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి యాప్‌ల ద్వారా వచ్చే ఉద్యోగ ఆఫర్లు, లాభాల హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద లింక్‌లు, డబ్బు పంపాలని కోరే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైతే వెంటనే పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పొట్యాల పాఠశాల విద్యార్థినీలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక





**బీబీఎంఏ /అంతర్గాం:** పెద్దపల్లి జిల్లాపెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని పొట్యాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై అభినందనలు అందుకున్నారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సిరి, అశ్విని, రత్నశ్రీలు సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యం.సంగీత తెలిపారు.ఈ నెల 24 నుంచి 26 వరకు మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు యం.సంగీత, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.తిరుపతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాంచందర్, కె.తిరుపతి, శ్రీధర్, లక్ష్మయ్య, శంకర్, జ్యోతివాని, సునీత, బాలయ్యతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు క్రీడాకారిణులను అభినందించారు.

## మామిడికుదురు వద్ద రోడ్డు ప్రమాదం: ఎంఎల్సీ కారును ఢీకొట్టిన బైక్, ఒకరికి తీవ్ర గాయాలు



**బిబిఎంఎ న్యూస్/మామిడికుదురు** :సోమవారం మామిడికుదురు మండలం పరిధిలోని 216 జాతీయ రహదారి క్రాసింగ్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎంఎల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ప్రయాణిస్తున్న కారును ఆదుర్రు వైపు నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ ద్వారా సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ముస్త్యాల గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**బిబిఎంఏన్యూస్/రామగిరి ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సుంకరి మహేందర్ ఉపసర్పంచ్ బేసినేని వినోద వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏఈవో అరవింద్, పంచాయతీ కార్యదర్శి ఆసియా ప్రజాప్రతినిధులతో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు.ప్రమాణ స్వీకార అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ..గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ పథకాలను , గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నీలం శ్రీనివాస్, గోషిక విజయ్, సుందిల్ల శారద, దేగ సందీప్ గోషిక నరసయ్య, సుందిల్ల కనకతార,గుమ్మడి మల్లయ్య గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వికరించిన నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ




**బిబిఎంఏ న్యూస్**/నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి రెండు అర్జీలను స్వీకరించారు. అందిన అర్జీలను తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల స్థితిగతులను తెలుసుకొని, వెంటనే పరిష్కారం దిశగా సూచనలు చేశారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా, మూడో వ్యక్తుల ప్రమేయం లేదా పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. తమ సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని, పోలీస్ శాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా పని చేస్తుందని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల రక్షణ, భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాలు నివారణకు 'స్టాప్-వాష్ అండ్ గో' కార్యక్రమం




**బిబిఎంఏ న్యూస్/కర్నూలు, డిసెంబర్ 22:**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల ప్రకారం, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యగా 'స్టాప్–వాష్ అండ్ గో' కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు వాహన డ్రైవర్లపై నిర్వహించబడుతోంది.పోలీసుల వివరాల ప్రకారం, డ్రైవర్లకు రోడ్డు సురక్షిత నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, వాహనాల పరిక్షలు, డ్రైవింగ్ సురక్షిత ప్రమాణాలు పరిశీలించడం ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించడం, డ్రైవర్లలో జాగ్రత్త పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.



# రామగుండం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ బి. రామ్ రెడ్డి



**బిబిఎంఏ న్యూస్/రామగుండం డిసెంబర్ 22:** రామగుండం పోలీస్ కమీషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని రామగుండం పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి, పిటిషన్ల నమోదు విధానం, రికార్డులు, పెండింగ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల పురోగతిని తనిఖీ చేశారు. నమోదైన కేసుల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ప్రజలతో మరియు ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తన, స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరుగుతున్న నేరాలపై ఎస్ఐ సంధ్యారాణిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు, పని తీరు, వారికి ఎదురవుతున్న సమస్యలపై కూడా చర్చించారు. విధుల్లో పారదర్శకత పాటించాలని, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీసీపీ ఆదేశించారు. మహిళా సిబ్బందిని అన్ని విధులలో సమర్థంగా వినియోగించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సంధ్య రాణి పాల్గొన్నారు.

# నిట్టూరు గ్రామపంచాయతీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం



**బిబిఎంఏ న్యూస్/పెద్దపల్లి డిసెంబర్ 22:** పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఆకుల సువర్ణతో పాటు గ్రామ వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఈఓ అలివేణి, పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్ నూతన ప్రజాప్రతినిధులతో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ ఆకుల సువర్ణ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల ఫిర్యాదుల స్వీకరణ

## - సత్వర పరిష్కారానికి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలు



**బిబిఎంఎ న్యూస్/పాలకోడేరు** :జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం పాలకోడేరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా ప్రతి అర్జీపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతతో వ్యవహరించాలని, సమస్యల మూలకారణాలను గుర్తించి పరిష్కారం అందించాలని తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై న్యాయబద్ధమైన విచారణ జరిపి తప్పకుండా పరిష్కారం అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.

# జనవరి 13 నాటికి ఓటరు జాబితా పూర్తి చేయాలి :రాష్ట్ర సీఈఓ సుదర్శన్ రెడ్డి



**బిబిఎంఏ న్యూస్/హైదరాబాద్, డిసెంబర్ 22:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీలు, ఓటరు మ్యాపింగ్ పనులను జనవరి 13 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటరు జాబితాల్లో డూప్లికేట్ ఎంట్రీలు, బ్లర్ ఫోటోలు, సమాన వివరాలను తప్పనిసరిగా గుర్తించి సరిచేయాలని సూచించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం, విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

# 2BHK హౌసింగ్ స్కామ్‌లో ఇద్దరు జరరించిన మోసగాళ్ల అరెస్ట్ చేసిన సుల్తాన్ బజార్ పోలీసులు



**బిబిఎంఏ న్యూస్/హైదరాబాద్, డిసెంబర్ 22:** ఈస్ట్ జోన్ సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ అధికారులు 2BHK ప్రభుత్వ హౌసింగ్ స్కామ్‌లో మోసం, నకిలీ పత్రాలతో సంబంధం ఉన్న ఇద్దరు గుర్తింపు పొందిన మోసగాళ్లను అరెస్ట్ చేశారు. నిధితుల వివరాలు.. ఉసికేల విజయ్ (ఎ1), అంబం మురళి (ఎ2). పోలీసుల వివరాల ప్రకారం నిందితులు తెలంగాణా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ అధికారులుగా ప్రవర్తిస్తూ 19 బాధితుల నుంచి సుమారు ?39 లక్షలను మోసం చేశారు. వారు నకిలీ అప్పగింపు లెటర్స్, నకిలీ సీల్‌లు, సంతకాలను ఉపయోగించి బలహీనులలను లభించేలా భ్రమలో పెట్టారు. సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం. 211/2025 నమోదు చేసి 406, 420, 468, 471 IPC సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన నిందితులను జ్యుడిషియల్ రిమాండ్ కోసం కోర్ట్‌కి హాజరు చేశారు.

# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి: ఎస్పీ బిందు మాధవ్



**బిబిఎంఎ న్యూస్/కాకినాడ** :పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) ద్వారా వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని 27 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ బిందు మాధవ్ ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు వెంటనే పంపించారు. ప్రతి అర్జీని చట్టపరిధిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని, పీజీఆర్ఎస్ వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల పంజా

**బిబిఎంఎ న్యూస్/మంథని, డిసెంబర్ 22:** మంథని మండలం ఎక్లాస్పూర్ సమీపంలో గాడిదల గండిగుట్ట ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆ ప్రాంతంలో 11 మంది మూడు ముక్కలాట ఆడుతున్నారని తెలిసింది. సిబ్బందితోనే అక్కడికి వెళ్ళగా ఎనిమిది మంది పారిపోయారు. ముగ్గురిని విచారించగా మొత్తం 11 మంది మూడు పత్తాలాట ఆడుతున్నట్లు తెలిపారు. అన్నం శ్రీనివాస్ మంథని ఎనగందుల శేఖర్ కాకర్లపల్లి, మాదాడి రాజిరెడ్డి సూరయ్యపల్లి ,మాచర్ల కుమార్ మంథని, నానువాళ్ళ నారాయణరెడ్డి ఎక్లాస్ పూర్, గడ్డం రమేష్ మంథని, బూడిద రాజయ్య మంథనితీగల రాయనర్సు కాకర్లపల్లి బొజ్జ రమేష్ కాకర్లపల్లి, గుత్తికొండ సరోత్తమ్ వరంగల్ జిల్లా జంజర్ల సమ్మయ్య గంగాపురిలపై కేసు నమోదు చేసినట్లు, ఘటనాస్థలం నుంచి మూడు ఫోన్లు, 25 వేల రూపాయలు, 52 ప్లేయింగ్ కార్డ్స్, మూడు బైక్స్ స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

# ట్రై కమిషనరేట్‌లలో మోస్ట్ వాంటెడ్ నేరస్థుడి అరెస్ట్

**బిబిఎంఏ న్యూస్ / హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని ఈస్ట్ జోన్ కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రై–కమిషనరేట్‌లలో (హైదరాబాద్ సిటీ, రాచకొండ, సైబరాబాద్) పలుకేసుల్లో వాంటెడ్‌గా ఉన్న నేరస్థుడు కే. సుధీర్‌ను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైం నెం. 432/2025 కింద అరెస్ట్ చేసిన నిందితుడు ఇప్పటివరకు 10 కేసుల్లో (9 మోసాలు, ఒక ద్విచక్ర వాహన దొంగతనం) పాల్పడ్డాడు. నిందితుడు తాను RTC విజిలెన్స్ అధికారినని నటిస్తూ, సీనియర్ ఐపీస్ అధికారుల వాట్సాప్ ప్రొఫైల్ ఫోటోలు ఉపయోగించి RTC కండక్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నట్లు వీడియోలు రికార్డ్ చేసి భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు గుంజినట్లు దర్యాప్తులో తేలింది. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి రెడ్మి మొబైల్ ఫోన్, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై గతంలో మీర్‌పేట్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లలో పెద్దఎత్తున మోసాలకు సంబంధించిన కేసులు నమోదై ఉండగా, కొన్ని కేసుల్లో NBWలు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.



## “ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” కార్యక్రమంలో

# సైబర్ నేరాలపై అవగాహన



**బిబిఎం ఏ న్యూస్/ఖమ్మం జిల్లా:** “ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్” ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం జిల్లా ఏన్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ మోసాల వల్ల నష్టం జరగదని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనే భావన చట్టంలో లేదని స్పష్టం చేసిన ఆమె, ఏ పోలీస్ అధికారి కూడా నేరుగా వాట్సప్ వీడియో కాల్స్ ద్వారా విచారణలు లేదా హెచ్చరికలు చేయరని చెప్పారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

# బొలెరో వ్యాన్ బోల్తా: ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు



**బిబిఎంఎ న్యూస్/కలిదిండి** :కలిదిండి మండలంలోని సున్నంపూడి గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. పనుల నిమిత్తం బయలుదేరిన బొలెరో వ్యాన్ ప్రమాదవశాత్తూ బోల్తా పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. సున్నంపూడికి చెందిన ఏడుకొండలు (52), ఆంజనేయులు (40) అనే ఇద్దరు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే గ్రామానికి చెందిన కృష్ణ మనోహర్కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి అతడిని ఏలూరులోని ఆసుపత్రికి తరలించారు. సున్నంపూడికి చెందిన ఈ ముగ్గురు వ్యక్తులు పనుల నిమిత్తం బయటకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ముత్తునూర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

## జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్

**బిబిఎంఏ న్యూస్/వెల్గటూర్:** కూచనపల్లి లక్ష్మి పోచమల్లు, ఉపసర్పంచ్ అక్రమ్ మాలిక్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులతో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకార అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ .. గ్రామపంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ పథకాలను , గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజాసమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# అనీల్ రావిపూడి అదుర్స్
# ఎఐతో ప్రచార వీడియో వైరల్

సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న వైఖరి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తనదైన పంథాలో కొత్త ఐడియాలను అప్లై చేస్తూ, ప్రతి సినిమాను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో అనిల్ దిట్ట. ప్రస్తుతం ఆయన మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' విషయంలో కూడా ఇదే ఫార్ములాను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలు రిలీజ్ చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు అనిల్. సినిమాతో సంబంధం ఉన్న ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా అనిల్ రావిపూడి ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని కూడా తన సినిమా ప్రమోషన్స్ కోసం వినియోగించి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా విడుదల చేసిన ఓ ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి? ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు' అంటూ అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ సినిమాలు.. ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోక సుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్ దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి చిత్రాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ వీడియోను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి



ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. వింటేజ్ చిరుని పరిచయం చేస్తూ రూపొందించిన ఈ వీడియో మెగా అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తోంది. నెట్టింట ఈ వీడియోకు భారీ స్పందన వస్తుండగా, అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది నెటిజన్లు మాత్రం 'అనిల్ ప్రమోషన్ స్ట్రాటజీ మామూలుగా లేదు? సినిమా కోసం ఏదీ వదలడం లేదుగా' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, 2025 సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి, 2026 సంక్రాంతికి కూడా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలనే ఎ÷-లాన్‌లో ఉన్నారు. అందులో భాగంగానే మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' తో సంక్రాంతి బరిలోకి దిగుతున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. అలాగే వెంకీ మామ (వెంకటేష్) ఈ మూవీలో తొలిసారి చిరంజీవితో కలిసి గెస్ట్ రోల్‌లో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

# ఉగాది నాటికి నంది అవార్డులు
## మంత్రి కందుల దుర్గేశ్



కందుల దుర్గేశ్‌సినీ ప్రముఖులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని వెల్లడిఏపీలో షూటింగులు చేసుకునే సినిమాలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్న మంత్రిటాలీవుడ్ కి ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఉగాది నాటికి నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దీనికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే కీలక సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తొలుత సినిమాటోగ్రఫీ, హోంశాఖల నేతృత్వంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని... ఏపీలో షూటింగులు, సినిమా టికెట్ రేట్లు, హై బడ్జెట్ సినిమాల టికెట్ ధరలపై చర్చిస్తామని చెప్పారు. ఆ సమావేశం అనంతరం సినీ ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశాలకు సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఏపీలో షూటింగ్ చేసుకునే సినిమాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.



# సమంతకూ తప్పని
# అభిమానుల తాకిడి

అభిమానుల అత్యుత్సాహం వల్ల 'ది రాజాసాబ్' ఈవెంట్‌లో నిధి అగర్వాల్ ఇబ్బంది పడిన సంఘటన మరువక ముందే సమంతకు కూడా అలాంటి చేదు అనుభవమే ఎదురైంది. తాజాగా హైదరాబాద్‌లో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె తిరిగి తన కారు వద్దకు వెళ్తుండగా అభిమానులు ఒక్కసారిగా సెల్ఫీల కోసం ఎగబడ్డారు. దీంతో సమంత ఇబ్బంది పడ్డారు. బాడీగార్డ్‌లు ఆమెను జాగ్రత్తగా కారు ఎక్కించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా నెటిజన్లు అభిమానుల తీరును తప్పుపడుతున్నారు.



# బుట్ట బొమ్మ లైనప్..
# లక్కు తగిలితే మాత్రం..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డే తెలుగులో గ్యాప్ తీసుకున్నా కూడా తమిళ, హిందీ భాషల్లో ఆఫర్లు అందుకుంటుంది. రాధే శ్యాం తర్వాత మహేష్ బాబు గుంటూరు కారం సినిమాకు ముందు సైన్ చేసిన అమ్మడు ఆ తర్వాత ప్రాజెక్ట్ నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి అమ్మడికి తెలుగులో అవకాశాలు లేవు. స్టార్ ఛాన్స్ లే కాదు మీడియం రేంజ్ హీరోలు కూడా పూజాని తీసుకోలేదు. ఐతే ఈ టైంలో పూజా హెగ్డేకి తమిళ పరిశ్రమ అండగా ఉంది. సూర్యతో రెట్రో చేసిన అమ్మడు అది రిజల్ట్ ఎలా ఉన్నా కూడా మరో రెండు ఛాన్స్ లు ఇచ్చింది. దుల్కర్ సల్మాన్ హీరోగా చేస్తున్న సినిమాలో.. పూజా హెగ్డే తమిళ్ లో ప్రస్తుతం లారెన్స్ తో కాంచన 4, దళపతి విజయ్ తో జన నాయగన్ చేస్తుంది. ఈ రెండిటితో పాటు ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో దుల్కర్ సల్మాన్ హీరోగా చేస్తున్న సినిమాలో ఛాన్స్ పట్టేసింది. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నెలకుడితి డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమాలో పూజా బేబ్ హీరోయిన్ గా నటిస్తుంది. ఎస్.ఎల్.వి బ్యానర్ లో సుధాకర్ చెరుకూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇదే కాకుండా బాలీవుడ్ లో హై జవాని తో ఇష్క్ హోనా హై సినిమా కూడా చేస్తుంది అమ్మడు. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా సెట్స్ మీద ఉంది. బాలీవుడ్ లో స్టార్ రేంజ్ కోసం ట్రై చేసిన పూజా హెగ్డే అక్కడ వరుస సినిమాలు చేస్తున్నా పెద్దగా క్రేజ్ రాలేదు. తెలుగులో స్టార్ స్టేటస్ వచ్చినా సరైన టైం లో మళ్లీ ఇక్కడ అవకాశాలు లేకుండా అయ్యింది. ఐతే ప్రస్తుతం అమ్మడి చేతిలో 4 సినిమాలు లైన్ లో ఉన్నాయి. వీటితో కచ్చితంగా తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది పూజా హెగ్డే. పూజా హెగ్డే థై షోకి సెపరేట్ ఫ్యాన్స్.. పూజా హెగ్డే సినిమాలో ఉందంటే గ్లామర్ కి ఢోకా లేదన్నట్టే లెక్క. అమ్మడి థై షోకి సెపరేట్ ఫ్యాన్స్ ఉన్నారు. మొన్నటిదాకా సౌత్ లో తనకు ఉన్న పాపులారిటీతో సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో నెట్టుకొచ్చిన పూజా హెగ్డే ఇప్పుడు తన పూర్తి ఫోకస్ సినిమాలే అనేస్తుంది. దుల్కర్ సినిమాతో తెలుగులో సత్తా చాటాలని చూస్తున్న అమ్మడి ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయన్నది చూడాలి. పూజా హెగ్డే మాత్రం తనకు అవకాశాలు ఉన్నా లేకపోయినా కాన్ఫిడెన్స్ ని మాత్రం లూజ్ అవ్వట్లేదు. తెలుగులో టైర్ 2 హీరోలతో అయినా నటించేందుకు అమ్మడు రెడీ అనేస్తుంది. దుల్కర్ సినిమా తర్వాత ఒకటి రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో బ్రహ్మానందం భేటీ..
## తాను గీసిన చిత్రపటం అందజేత

హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ముతో బ్రహ్మానందం భేటీబ్రహ్మానందాన్ని శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించిన రాష్ట్రపతిప్రతిగా తాను స్వయంగా గీసిన ఆంజనేయ స్వామి చిత్రాన్ని రాష్ట్రపతికి బహూకరించిన బ్రహ్మీటాలీవుడ్ హాస్యనటుడు బ్రహ్మానందం నిన్న (ఆదివారం) హైదరాబాద్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి బ్రహ్మానందాన్ని శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ప్రతిగా బ్రహ్మానందం తాను స్వయంగా గీసిన ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని రాష్ట్రపతికి బహూకరించారు. అనంతరం ఇద్దరూ కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ భేటీకి గల కారణం అధికారికంగా వెల్లడికాలేదు. అయితే, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్



అవుతున్నాయి. బ్రహ్మీ కేవలం నటుడే కాకుండా గొప్ప చిత్రకారుడు కూడా. ముఖ్యంగా పెన్సిల్ ఆర్ట్‌లో దేవుళ్ల చిత్రాలను అద్భుతంగా గీస్తారు. ఖాళీ సమయాల్లో తన మనసుకు నచ్చిన చిత్రాలను గీయడం ఆయనకు ఎంతో ఇష్టం. ఆయా చిత్రాలను తనను కలిసే ప్రముఖులకు బహుమతిగా అందించడం బ్రహ్మానందం ప్రత్యేకత. కృష్ణంరాజు నుంచి రామ్ చరణ్ వరకు ఎంతోమందికి ఆయన గీసిన చిత్రాలను అందించారు. కాగా, వయోభారంతో ఇటీవల సినిమాల సంఖ్య తగ్గించినా అప్పుడప్పుడు ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తూ ప్రేక్షకులను నవ్విస్తూనే ఉన్నారాయన. తాజాగా విడుదలైన 'గుర్రం పాపిరెడ్డి' సినిమాలో ఆయన సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రపతితో సమావేశమైన ఈ సందర్భం బ్రహ్మానందం వ్యక్తిత్వానికి మరో గౌరవ ఘట్టంగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 24న మైసా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

కన్నడ భామ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ప్రాజెక్ట్ మైసా. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక మందన్నా ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో కనిపించనున్నట్టు హింట్ ఇచ్చేశారు మేకర్స్. తాజాగా మరో క్రేజీ వార్తను షేర్ చేశారు. మైసా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని పోస్టర్లతో తెలుస్తోంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో పాన్ ఇండియా మార్కెట్‌ను షేక్ చేసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా ఎలా మెప్పించబోతున్నదన్నది ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తుండగా.. కల్కి 2898 ఏడీ చిత్రానికి పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. కేరళలోని అథిరప్పిల్లీలో షూటింగ్ షురూ అయినట్టు ఇప్పటికే మేకర్స్ అప్‌డేట్ అందించారు.

-----

